# వ్యాస కౌముది



**మనభారతం** **డా.వల్లూరుపల్లి శివాజీరావు**

## 120
## మహాత్మా గాంధి–26



***ముందు మాట:*** *గత సంచికలో గాంధీజీ డిశంబర్ 1900 లో గాంధీజీ భారతావని వచ్చినప్పుడు 26–30 తేదీల మధ్య కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ పార్టీ 6 వ సమావేశానికి హాజరు అయినట్లు తెలుసుకున్నాము. ఆ సమయంలో కలకత్తాలోనే ఒక నెల రోజులు (జనవరి 1901) ఉండి అనేక మంది భారతీయ నాయకులను ఆయన కలుసు కోవటం జరిగింది. గాంధీజీ యెడల సదభిప్రాయంతో ఉన్న గోపాలకృష్ణ గోఖలే ఆయనను తనతోపాటు ఇండియన్ క్లబ్ హోటల్ గదిలోఉండమని ఆహ్వానించారు. అప్పుడు గోఖలే "గాంధీ, ఈ దేశంలో ఉన్నప్పుడు నీవు ఇచ్చటి ప్రజలతో మమే కమవ్వాలి. అలాగే కాంగ్రెస్ పార్టీకికూడా సేవ చేయమని నిన్ను కోరుచున్నాను" అని సూచించారు. దానికి గాంధీజీ సమ్మతించటం జరిగింది. ఆ తరువాత జరిగిన ముఖ్య విషయాలు ఇప్పుడు తెలుసుకుందాము.*

-----------

### కలకత్తాలో విశిష్ట వ్యక్తులతో గాంధీజీ సమావేశం

గాంధీజీ కలకత్తాలో ఉన్నపుడు (జనవరి 1901) గోపాలకృష్ణ గోఖలే ఆయనను తన తమ్ముడుగా ఆదరించి ఆయన అవసరాలు తెలుసుకుని అన్ని ఏర్పాటు చేశారు. గాంధీజీ అవసరాలు అతి తక్కువ అని గమనించటం జరిగింది. గాంధీజీ

వ్యక్తిగత శుభ్రత, పట్టుదల, క్రమబద్ధత ఆయనకు ఎంతో నచ్చి ఆయ నను పొగడ్తలతో నింపివేశారు. గోఖలే తన వ్యక్తిగత విషయాలను కూడా దాచుకోకుండా అన్నీ గాంధీజీ తో పంచుకున్నారు, ఆయనకు అనేక ప్రముఖులును పరిచయం చేశారు.

వారిలో ఒకరు '**ప్రఫుల్ల చంద్ర రే**' (Prafulla Chandra Ray) ఈయన గురించి చెప్పుతూ "ఈయన కలకత్తాలోని ప్రెసిడెన్సీ కాలేజీలో (Presidency College) ప్రొఫెసర్ (రసాయన శాస్త్రం); జీతం నెలకు 800 రూపాయలు. అందులో ఆయన 40 రూపాయలు తన కోసం ఉంచుకుని మిగతా జీతం ప్రజాప్రయోజనాలకోసం వెచ్చిస్తారు. ఆయనకు వివాహం చేసుకోవటం ఇష్టంలేదు. ఆయన ఆహార్యం అతి సామాన్యమై నది. కేవలం ఖాదీ వస్త్రాలే ధరిస్తారు. ఆయన తన తీరిక సమయం అంతా ప్రజాసేవకు మాత్రమే విని యోగిస్తారు" అని వివరించారు.

P.C. Ray మరియు గోఖలే గొప్పతనం విని ఇటువంటి వ్యక్తులముందు, యోధుల ముందు తాను చాలా చిన్నవాడిని అని గాంధీజీకి అనిపించింది.

***గోఖలే గురించి మరికొన్ని విషయాలను గాంధీజీ ఇలా వివరించారు.***

"పని యెడల గోఖలే కు ఉన్న నిమగ్నత చూస్తుంటే ఎంతో ముచ్చట వేస్తుంది. ఆయన ఒక్క నిముషం కూడా వృధా పోనీయడు. ఆయన వ్యక్తిగత సంబంధాలు, స్నేహాలు అన్నీ ప్రజా ప్రయోజనాలకోసమే విని యోగిస్తారు. ఆయన సంభాషణలు అన్నీ భారతదేశ బాగోగుల విషయం వైపే పయనిస్తాయి. ఆయన మాటలలో అసత్యాలు, కపటత్వం ఉండవు. దేశంలోని పేదరికం, ప్రజల అణచివేత, తదితర విష యాలను గురించి తీవ్ర ఆందోళన చెందుతారు. ఎంతోమంది ఆయనకు ఎన్నో సలహాలు ఇస్తూ ఉంటా రు. కాని ఆయన వాళ్లతో ***'మీ పనులు మీరు చేయండి. నా పని నన్ను చేయనివ్వండి. నాకు కావలసింది దేశ స్వతంత్రత. దానిని సాధించిన తరువాత ఇతర విషయాలగురించి ఆలోచించవచ్చు. ప్రస్తుతం నా సమయం, నా శక్తి దానికోసమే వినియోగిస్తాను'*** అని విశదీకరించారు."

"గోఖలే గారికి '**మహాదేవ్ గోవింద రానడే**' అంటే అత్యంత గౌరవం. ప్రతి విషయంలోనూ ఆయన మాట గోఖలేకు వేదం. నేను భారతావనిలో ఉన్నప్పుడే (1901, జనవరి 16 వ తేదీన) రానడే మరణించారు. ఆయన సంస్మరణ సభకు నన్ను ఆహ్వానించినప్పుడు గోఖలే '**గోవింద రానడే ఒక న్యాయ మూర్తి అయినా కాంగ్రెస్ సభలకు తప్పక నిర్భయంగా హాజరు అయ్యేవారు. ఆయన తెలివికి, నిర్ణయాలకు కాంగ్రెస్ సభ్యులందరు ముచ్చట పడేవారు**' అంటూ ఈ 59 ఏళ్ల కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక సభ్యుడిని చాలా ప్రశంసించారు."

గోఖలే గురించి గాంధీజీ మరి కొన్ని ఆసక్తికర విషయాలు చెప్పటం జరింగింది.

“ఆరోజులలో గోఖలే ఒక గుఱ్రపు బండిలో ప్రయాణించేవారు. ఏ కారణం వల్ల ఆయన గుఱ్రపు బగ్గీలో ప్రయాణించేవారో నాకు తెలియదు. తెలియక ఒక రోజు ‘**మీరు ఒక చోట నుంచి మరొక చోటకు ప్రయాణించ డానికి ట్రామ్ కారులో** (tram-car) **ప్రయాణించవచ్చుకదా**’ అని నిలదీస్తూ ‘**అందులో ప్రయాణిస్తే నాయ కుడి గౌరవం తగ్గిపోతుందా?**’ అని ప్రశ్నించాను.”

“దీనికి గోఖలే కొంచెం నొచ్చుకుని ‘**గాంధీ, నువ్వు నన్ను అర్ధం చేసుకోవటంలో విఫలమయ్యావు. నా వ్యక్తిగత సుఖాల కొరకు కాంగ్రెస్ కౌన్సిల్ భత్యాలను వినియోగించను. నేను నీ లాగా ట్రామ్ కారులలో స్వేచ్ఛగా ప్రయాణించటం వీలుకాదు. దేశంలో ఎంతో ప్రచారంలో ఉన్న నేను ఈ ట్రామ్ కారులలో ప్రయా ణించటం అసాధ్యమైనదికాదు కాని నాకు చాలా కష్టతరమైన పని. నాయకులందరు వ్యక్తిగత సౌక ర్యాలకు ప్రాకులాడరు, వాటిని ఆశించరు.**’

‘**గాంధీ, నాకు నీ నిరాడంబర అలవాట్లు నాకు చాలా నచ్చుతాయి. నేను కూడా వీలయినంత చాలా సరళమైన జీవితాన్ని సాగించాలని భావిస్తాను. కాని ప్రజానాయకులకు కొన్ని ఖర్చులు తప్పవు**’ అని విపులీ కరించారు.’

“దానికి నేను ‘**కాని మీరు నడవటానికి బయటకు వెళ్లారు. అందుకే మీరు తరచుగా జబ్బు పడు తూ ఉంటారు. ప్రజా జీవితం శారీరక వ్యాయామానికి తగిన సమయం ఇవ్వదా?**’ అని ప్రశ్నించాను”.

“ప్రత్యుత్తరంగా గోఖలే ‘ప్రజలకు సేవలో నిమగ్నమయినప్పుడు నడవటానికి కావలసిన సమయం ఎప్పుడు దొరుకుంది” అని సమాధానం ఇచ్చారు.

“గోఖలే యెడల చాలాగౌరవం ఉండటంవల్ల నేను ఆయనకు ఎప్పుడూ వ్యతిరేకంగా మాట్లాడ లేదు.”

కాని ఆయన సమాధానం నాకు సంతృప్తికరంగా లేదు. నేను ఇప్పుడు, ఎల్లప్పుడూ ప్రతివ్యక్తి భోజనానికి సమయం వెచ్చించినట్లే వ్యాయామం కోసం కూడా కొంత సమయం వెచ్చించాలి అని గట్టిగా నమ్ముతాను. ఇలా చేస్తే ప్రజాసేవ ఇంకా సమర్ధవంతంగా చేయచ్చని నా అభిప్రాయం.”

------

గోఖలే గృహంలో నివసిస్తూ కూడా గాంధీజీ అనేక విశిష్ట వ్యక్తులను కలుసుకోవటం జరిగింది.

వీరిలో ఒకరు '**బాబు కాళీచరణ్ బెనర్జీ**' (1847–1907) బెంగాలీ బ్రాహ్మణ కుటుంబంలోని వ్యక్తి అయినా క్రిష్టియన్ మతం స్వీకరించి Calcutta Christo Samaj ను స్థాపించిన ఈయన కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక సభ్యుడు. కాంగ్రెస్ పార్టీలో చురుకుగా పాల్గొనే హిందువులు, మహ్మదీయులకు దూరంగా ఉండేవారు.

కలకత్తాలో గాంధీజీ మరొక విశిష్ట వ్యక్తిని కలుసుకోవటం జరిగింది. ఈయన '**రొమేష్ చంద్ర మిత్ర మిట్టర్**'. కలకత్తా High Court న్యాయమూర్తి అయిన ఈయన కాళీ మాత దేవాలయం సమీపంలో కాళీఘాట్ లో నివసించేవారు. ఆయనను కలసిన కలిసిన తరువాత గాంధీజీ కాళీ దేవాలయం దర్శించి నప్పుడు గొర్రెల సమూహాన్ని కాళీ మాతకు బలి ఇవ్వటం జరుగుతోంది. ఈ బలుల కారణంగా గొర్రెల రక్తం ఏరులై పారటం చూసి గాంధీజీ మనస్సు కాకావికలం అయింది.

**గాంధీజీ అహింస వాదిగా మారటానికి తొలి అనుభవం**

ఆయన దృష్టిలో మానవుడి జీవితం లాంటిదే గొర్రె జీవితం కూడా. అటువంటప్పుడు దేవత అను గ్రహం, సంతృప్తి కోసం మానవుడు మూగజీవులను బలి ఇవ్వటం గాంధీజీకి ఏమాత్రం నచ్చలేదు. ఈ జంతుబలినుంచి మానవులను ఎలా మార్చాలా అనే దీర్ఘ ఆలోచనలలో ఉన్న ఈ మహాత్ముడి మనస్సు కాలక్రమేణా '**అహింస**' వాదానికి తెరలేపింది.

కలకత్తాలో ఉన్నప్పుడు వివేకానంద స్వామిని చూడాలని గాంధీజీ ఎంతో ఉత్సా హంగా హౌరా లోని 'బేలూరు మఠం' వెళ్లారు. కాని ఆ సమయంలో స్వామి అనారోగ్యంతో కలకత్తాలోని తన స్వగృహం లో ఉండటం వల్ల ఆయనను చూడటానికి వీలుపడలేదు.

ఆ తరువాత గాంధీజీ Sisterనివేదితను చౌరంగీ లోని ఆమె నివాసంలో కలవటం జరి గింది. ఆమె చుట్టూ ఉన్న వైభవాన్ని చూసి ఆయన ఆశ్చర్యపోయారు. లండన్ లో జన్మించిన ఈమె వివే కానంద స్వామి బోధనలకు ప్రభావితురాలై 1898 లో కలకత్తా వచ్చి ఆయన శిష్యురాలైంది. 32 ఏళ్ల వయ స్సున్న ఈ 'Margaret Elizabeth Noble' చేత వివేకానంద స్వామి బ్రహ్మచర్యం పాటింపజేసి ఆమెకు 'నివేదిత' (Dedicated to God) అని నామకరణం చేయటం జరిగింది.

ఈమెతో గాంధీజీ జరిపిన చర్చలలో ఇద్దరికీ ఎక్కడా ఏకాభిప్రాయం లేదు. ఈ సంగతి గోఖలే తో చెప్పగా ఆయన "గాంధీ, నీ లాంటి వ్యక్తికి ఆమె లాంటి అస్థిర వ్యక్తికి ఏకాభిప్రాయం కుదరలేదంటే ఆశ్చర్యపడనవసరం లేదు" అని సముదాయించారు.

Sister నివేదితను గాంధీజీ మరొకసారి ఆయన లండన్ లో ఉన్నప్పుడు మిత్రుడు 'Pestonji Padshah' గృహంలో కలవటం జరిగింది. ఈ సారికూడా వీరిరువురి చర్చలలో ఏకాభిప్రాయం కుదరక పోయినా హిందూ మతం పట్ల ఆమెకు ఉన్న అత్యంత ప్రేమ పట్ల ఆయన ముగ్ధుడయ్యారు. నివేదిత రచించిన పుస్తకాల ద్వారా ఆమె గురించి గాంధీజీ ఎక్కువ తెలుసుకోగలిగారు.

కలకత్తాలో ఉన్న సమయంలో గాంధీజీ అనేక ప్రముఖ వ్యక్తులను కలుసుకోవటం జరిగింది. అదే సమయంలో కొంత సమయం మత, ప్రభుత్వ సంస్థలకు వెళ్లి వాటిని గురించి తెలుసుకోటానికి వినియోగించారు. అదే సమయంలో ఒక రోజు రాజకీయ సమావేశంలో తాను దక్షిణ ఆఫ్రికాలో బోయెర్ యుద్ధం (Boer War) సమయంలో అంబులెన్స్ (ambulance) దళాలను ఏర్పాటు చేసి క్షత గాత్రులకు ఎలా సేవ చేశారో శ్రోతలకు వివరించటం జరిగింది. అది విని బెంగాలీ శాస్త్రవేత్త, చరిత్రకారుడు, పారి శ్రామికవేత్త Dr Prafulla Chandra Ray మెచ్చుకుని గాంధీజీ సేవలను కొనియాడారు. గోఖలే కూడా చాలా మెచ్చుకున్నారు.

గోఖలే గృహంలో ఆయన కలసి ఉన్న నెల రోజులు గాంధీజీకి అనేక మంది బెంగాలీ కుటుం బాలను కలుసుకోటానికి వీలయింది. ఆలా ఆయనకు బెంగాలీలతో సన్నిహిత పరిచయం ఏర్పడింది.

**బర్మాలో గాంధీజీ పర్యటన**

కలకత్తాలో ఉన్నప్పుడే గాంధీజీ కొద్ది రోజులు (ఫిబ్రవరి 1901) బర్మా (Burma) వెళ్లారు. అచ్చట బౌద్ధ సన్యాసులను కలుసుకున్నప్పుడు, వారిలో ఉన్న బద్ధకాన్ని చూసి ఆయన ఎంతో బాధపడ్డారు. రంగూన్ (Yangon) లోని బౌద్ధ Golden Pagoda ను సందర్శించి అచ్చెరువందినా, కోట్లాది బుల్లి కొవ్వొత్తులు నిత్యం కాలుతూ ఉండటం ఆయనకు నచ్చలేదు. అదేగాక ఎలుకలు గర్భగుడిలో నిరాటంకంగా సంచ రించటం ఆయన గర్హించారు. అచ్చటి స్త్రీల స్వేచ్ఛ, శక్తి, ఉత్సాహం చూసి ముగ్ధుడయిన గాంధీజీ పురు షుల ఉదాసీనత, బద్ధకం ఆయనకు చాలా బాధ కలిగించింది.

### కలకత్తానుంచి ఇతర ప్రదేశాలకు గాంధీజీ పర్యటన

బర్మా నుంచి కలకత్తా తిరిగి వచ్చిన తరువాత గాంధీజీ ఎంతో బాధతో గోఖలే వద్ద సెలవు తీసుకుని దేశమంతా రైలు (train) లో తిరగాలని నిర్ణయించుకుని ఆయనతో చర్చించటం జరిగింది. గోఖలే చాలా సంతోషంతో ఆమోదించి రైలు ప్రయాణానికి తగిన జాగ్రత్తలు సూచించి కలకత్తా రైలు స్టేషన్ కు వచ్చి గాంధీజీకి వీడ్కోలు పలికారు. దారిలో వారణాసిలో ఆగి Mrs. Annie Besant ను దర్శించాలనుకున్నా ఆమె ఆ సమయంలో అనారోగ్యంతో ఉండటం వల్ల వీలు కాలేదు. {అంతకు మూడు ఏళ్లకు ముందు: జులై 1898లో) ఆమె వారణాసిలో Central Hindu School ను స్థాపించారు. (ఈ School ను కొంతకాలం తరువాత ఆమె పండిట్ మదన్ మోహన్ మాలవీయాకు అంకితం చేయటం జరిగింది. ఇదే 1916 లో ఆయన స్థాపించిన Banaras Hindu University కి కేంద్రం అయింది}.

గాంధీజీ రైలు ప్రయాణమంతా మూడవ తరగతిలోనే జరిగింది. కలకత్తా నుంచి మొదట గుజరాత్ లోని రాజకోట్ వెళ్లి, అక్కడనుంచి వారణాసి, ఆగ్రా, జైపూర్, పాలంపూర్, అనేక ఇతర పట్టణాలను సందర్శించారు. అన్ని చోట్ల ఆయన ధర్మ సత్రములలోనే నివసించారు. ఈ మొత్తం ప్రయా ణానికి, ధర్మ సత్రముల ఖర్చుతో కలిపి 31 రూపాయలు కూడా దాటలేదు.

వారణాసిలో కాశీ విశ్వనాథ్ దేవాలయం సందర్శించిన తరువాత Mrs. Besant ను ఈ సారి అయినా కలవాలని ఎదురు గాంధీజీ ఎదురు చేశారు. ఆ సమయంలో ఆమె అప్పుడే తన అనారోగ్యం నుంచి కోలుకున్నారు. గాంధీజీ వచ్చారని తెలుసుకుని ఆమె బయటకు వచ్చి ఆయనను స్వాగతించారు.

వెంటనే గాంధీజీ "నేను మిమ్ములను కలిసి మీయెడల నాకు ఉన్న గౌరవాన్ని తెలియజేయాలనుకు న్నాను. మీరు అనారోగ్యంగా ఉన్నారని నాకు తెలుసు. అలా ఉన్నా నన్ను మన్నించినందుకు నా ధన్య వాదాలు. ఇక మిమ్ములను ఇబ్బంది పెట్టను" అని నుడివారు.

### రాజ్ కోట, బొంబాయిలో గాంధీజీ న్యాయవాదిగా జీవితం ప్రారంభం

ఈ సుదూర ప్రయాణం తరువాత 1901 మార్చి లో బొంబాయి చేరుకున్న తరువాత అప్పటికి అచ్చట ఉన్న గోఖలే గాంధీ జీని తిరిగి దక్షిణ ఆఫ్రికా తిరిగి వెళ్ళకుండా బొంబాయిలోనే స్థిరపడి న్యాయవాదిగా ఉంటూ, ప్రజాసేవ చేయమని

సూచించారు. ఆ రోజులలో ప్రజాసేవ అంటే కాంగ్రెస్ పార్టీలో పనిచేయ టమే. బొంబాయిలో ఉంటే ప్రజాసేవలో తనకు సహాయంగా ఉండవచ్చని గోఖలే ఆలోచన.

గోఖలే సలహా నచ్చినా బారిస్టర్ గా తాను నెగ్గుతాననే నమ్మకం గాంధీజీకి అంతగా లేదు. 1893 మే నెలలో దక్షిణ ఆఫ్రికా వెళ్లక ముందు బారిస్టర్ గా తన చేదు అనుభవం ఆయన మరచి పోలేదు.

**గోఖలే సలహా మీద రాజ్ కోటలో న్యాయవాది వృత్తి ప్రారంభించాలని నిర్ణయించారు గాంధీజీ. దానిని గురించి ఆయన ఇలా వివరించారు:**

"రాజ్ కోటలో నా మిత్రుడు, శ్రేయోభిలాషి '**కేవలరామ్ దవే**' వెంటనే నాకు మూడు కేసులు అప్ప జెప్పారు. గతంలో ఆయన నన్ను ప్రోత్సహించి బారిష్టర్ విద్య నిమిత్తం ఇంగ్లాడ్ వెళ్ళేటట్లు చేశారు. ఈ మూడు కేసులు తీసుకొనే ముందు వీటికి న్యాయం చేయగలనా అనే సందేహం నాలో కలిగింది. అప్పు డు కేవలరామ్ 'గెలుపు, ఓటమిల గురించి ఆందోళన వద్దు. నీ శక్తిమేరకు నీవు ప్రయత్నించు. నేను నీకు సహాయంగా ఉంటాను' అని భరోసా ఇచ్చాడు."

"మరొకవైపు అప్పటికే పేరొందిన న్యాయవాది సార్జెంట్ సమర్థ్. నేను ఈ కేసులు వాదించటానికి బాగానే సంసిద్ధుడనయ్యాను. దీనికి కేవలరామ్ దవే నాకు క్షుణ్ణంగా తర్ఫీదు ఇచ్చారు. అదీగాక నాకు దక్షిణ ఆఫ్రికాలో న్యాయవాదిగా పనిచేసిన అనుభవం ఉంది. చివరకు ఈ మూడుకేసులు వాదించి గెలి చాను. వాటి మీద పై కోర్టులో అప్పీల్ వేసినా నాకే విజయం వరించింది. ఈ విజయం నేను బొంబాయిలో న్యాయవాదిగా విఫలం అవ్వక పోవచ్చనే ఆశను నాలో ప్రేరేరింపించింది."

"కాని బొంబాయిలో కంటే మరి కొన్నాళ్లు రాజ్ కోటలోనే న్యాయవాది వృత్తి కొనసాగించాలనుకున్నాను. ఒక రోజు నా ఆప్తుడు కేవలరామ్ దవే వచ్చి 'గాంధీ: నీవు ఇచ్చటే మురిగిపోవటం నాకు ఇష్టం లేదు. నీవు బొంబాయిలో స్థిరపడాలి' అని సలహా ఇచ్చాడు.

"అప్పుడు నేను 'అచ్చట నాకు పని ఎలా దొరుకుతుంది? నీవు అచ్చట మొదట్లో అయ్యే ఖర్చులు భరిస్తావా' అని ప్రశ్నించాను."

"ఆయన 'అలాగే భరిస్తాను. నీవు బొంబాయిలో ఉంటే నువ్వు పెద్ద బారిష్టర్ అని క్లయింట్లు కు చెప్పుతాము. మేము ఇచ్చట వారి కేసులు బాగా వాదించటానికి తగిన న్యాయ సలహాలు నీవు పంపి స్తే మేము ఆ సలహాలను

ఉపయోగించి కేసులు గెలుస్తాము. నీవు ఇప్పటికే నీ న్యాయ నైపుణ్యంతో చాలా కేసులు గెలిచావు. అందువల్ల మాకు నీగురించి ఏ ఆందోళనా లేదు. నీవు ఆలోచించి ఎప్పుడు బొంబా యి వెళ్లగలవో చెప్పు' అని సలహా ఇచ్చాడు."

"దానికి నేను అంగీకరించి 'నాకు నాటాల్ నుంచి పైకం రావలసి ఉంది. అది నాకు అందగానే నేను బొంబాయి వెళ్తాను' అని ఆయనకు చెప్పాను."

"రెండు వరాల తరువాత నాటాల్ నుంచి పైకం అందిన వెంటనే (1901 డిశంబర్) నేను బొంబాయి వెళ్ళాను. అచ్చట Fort Area లో Payne, Gilbert, Sayani వారి ఆఫీసు సముదాయంలో ఒక గది అద్దెకు తీసుకుని High Court లో న్యాయవాది వృత్తిని ప్రారంభించాను."

పుత్రుడు మణిలాల్ అనారోగ్యం

Fort Area కు దగ్గరలో ఉన్న గుర్గాన్ (Gurgaon)లో ఒక ఇల్లు అద్దెకు తీసుకుని కుటంబంతో గాంధీజీ కాపరం పెట్టారు. కాని ఆయన అక్కడ స్థిరపడకూడదన్నట్లు దేవుడు అకస్మాత్తుగా ఒక సమస్యను సృష్టించాడు. ఆ ఇంట్లోకి మారిన కొద్దిరోజులకే గాంధీజీ 10 ఏళ్ళ రెండవ కుమారుడు 'మణిలాల్' అనా రోగ్యం బారిన పడటం జరిగింది. కొన్ని ఏళ్ల క్రితం అతనికి మసూచి (small-pox) వ్యాధి వచ్చింది. ఇప్పుడు అనుకోకుండా టైఫాయిడ్ (typhoid) వ్యాధితోపాటు నిమోనియా (pneumonia) కూడా వచ్చింది. తద్వారా రాత్రి పూట పిచ్చిపిచ్చి ప్రేలాపనలు మొదలయ్యాయి.

---------సశేషం---------

*ఆ తరువాత మణిలాల్ కు ఏమి జరిగిందీ, భారతావనిలో స్థిరపడాలనుకున్న గాంధీజీ జీవితం ఏవిధంగా మరో మలుపు తిరిగిందీ వచ్చే సంచికలో తెలుసుకుందాము.*

COMMENTS